ప్రజా సంక్షేమమే లక్ష్యం

దుండిగల్, ఫిబ్రవరి 9: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన వివిధ వర్గాల ప్రజలు, సంక్షేమ సంఘాల నేతలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీని ఆదివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్సీకి వివరించడంతోపాటు పరిష్కరించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

దుండిగల్, ఫిబ్రవరి 9: పేదలు, రైతులు, కార్మికుల పొట్ట గొట్టి, కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు వ్యతిరేకంగా సోమవారం నగరంలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని కుత్బుల్లాపూర్ మండలం సీపీఎం కార్యదర్శి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివారం గాజుల రామారావు సర్కిల్, షాపూర్‌నగర్‌లోని రైతు బజార్‌లో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజావ్యతిరేకంగా ఉందన్నారు. పేద ప్రజలు, రైతులు, కార్మికులకు అన్యాయం చేసే విధంగా ఉన్న ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా సోమవారం నగరంలోని ఇందిరాపార్క్‌లో జరిగే ధర్నాలు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు అంజయ్య, తిమ్మప్ప, శీను, సాధువు, ప్రసాద్, మధు, వీరేశ్ పాల్గొన్నారు.

షాపూర్‌నగర్ మార్కెట్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నేత లక్ష్మణ్

మాజీ కార్పొరేటర్ రాజును సత్కరిస్తున్న ఎమ్మెల్యే

ఘన సన్మానం

దుండిగల్, ఫిబ్రవరి 9: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజు సన్మాన సభను ఆదివారం స్థానికులు బాచుపల్లిలోని కౌసల్య కాలనీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరైన రాజును సత్కరించారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు,నేతలు పాల్గొన్నారు

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 9 : వసంతనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వాణి ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గోకుల్ ప్లాట్స్, వినాయకపార్క్, వెంకటరమణకాలనీ, సాయిహిల్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 9 : మూసాపేటలోని కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. నేడు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌తో పాటు పలువురు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలోని కాలనీలు, బస్తీల్లో నెలకొన్న ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అలాగే కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కొనసాగుతుందని ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు గంగాధర్, వంశీకృష్ణ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 9 : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ డైరెక్టర్ కమలాకర్, వైద్యశాల నిర్వాహకులు అప్పర్లరావు, మీరారావు, ప్రశాంత్ రెడ్డి, సీఈవో ఎన్.యోబు, రాందేవ్‌రావు వైద్యశాల మెడికల్ డైరెక్టర్ కమలాకర్ అన్నాను. ఆదివారం వైద్యశాలలో నిర్వహించిన మెడ, వెన్నునొప్పి, తదితర ఉచిత వైద్య సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో రోగానిర్ధారణ జరిగినప్పుడే వైద్య చికిత్స చేయించుకోవడం సులభం అవుతుందన్నారు. సమాజంలోని పేదవారికి అండగా నిలిచేందుకు... తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించేందుకు వైద్యశాల కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో 400 మందికిపైగా పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో ఎన్.యోబు, రేఖీ తెరపి గ్రాండ్ మాస్టర్ లక్ష్మి, వైద్యులు రాజేశ్, పవన్, మణికుమార్, సత్యనారాయణ, భవానంద్ సిబ్బంది ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ శాసనసభ్యుడు పల్లా వెంకటరెడ్డి తదితరులు

మాదాపూర్, ఫిబ్రవరి (నమస్తే తెలంగాణ) 9: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌కు చెందిన సీఆర్ పోలీ క్లీనిక్ ఆధ్వర్యంలో శిల్పా పార్క్ గ్రౌండ్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ శాసనసభ్యుడు పల్లా వెంకటరెడ్డి, శిల్పా పార్క్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ హాజరై ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగ పరచుకోవాలన్నారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్, కోశాధికారి చెన్నకేశవరావు ఉన్నారు.

ఐరిష్ అంతర్జాతీయ ఎక్సలెన్స్ ప్రిన్సిపాల్ అవార్డ్‌కు తులసీకుమారినందు

అవార్డుతో తులసీకుమారి నందు

దుండిగల్, ఫిబ్రవరి 9: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం డివిజన్ పరిధి, సూరారంలోని ఐరిష్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ డా. తులసికుమారి నందుకు ప్రతిష్టాత్మక ఎక్సలెన్స్ ప్రిన్సిపాల్ అవార్డు దక్కినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది. శనివారం రాత్రి పూణేలోని ఓ హోటల్‌లో జరిగిన ఎడ్యుకేషన్ ఎక్సలెంట్ కన్‌క్లేవ్ కార్యక్రమంలో నిర్వాహకులు ఈ పురస్కారాన్ని డాక్టర్ తులసికుమారి నందుకు అందజేశారు. విద్యారంగంలో ఆమె చేస్తున్న సేవలకు అవార్డు లభించడం ఆనందంగా ఉందన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

దుండిగల్, ఫిబ్రవరి 9: బాచుపల్లి మండల పరిధిలోని నిజాంపేట్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 223/21లో ఉన్న ప్రభుత్వ భూమిని భూ ఆక్రమణదారుల నుంచి రక్షించాలని ఆకుల సతీశ్ డిమాండ్ చేశారు. సర్వేనెంబర్ 233/21లోని సుమారు 1134 గజాల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రి నిర్మాణాలు చేపడుతూ కబలించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ విషయమై ఎమ్మార్వోకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ప్రభుత్వ భూముల రక్షణకు హైడ్రాను ఏర్పాటు చేశామని గొప్పలకు పోతుండగా స్థానిక కాంగ్రెస్ నాయకులు మాత్రం కబ్జాదారులకు అండగా ఉంటూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారులు స్పందించి కబ్జాలను అడ్డుకోవాలని, లేకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూములల్లో జరుగుతున్న కబ్జాలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న స్థానికులు

మెడిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

ధ్యానంతో ఒత్తిడి దూరం: ఎమ్మెల్యే కేపీ

దుండిగల్, ఫిబ్రవరి 9 : ధ్యానంతో మానసిక ఒత్తిడిని తగ్గించుకునే అవకాశం ఉందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే ఏపీ, వివేకానంద అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాజయోగ మెడిటేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నీతి, శాంతి, సామరస్యాన్ని నెలకొల్పడంలో బ్రహ్మకుమారిస్ చేస్తున్న కృషి అభినందనీయమదన్నారు. కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మకుమారి లతోపాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కబీర్ నగర్ సంక్షేమ సంఘం

అధ్యక్షుడిగా జోసెఫ్

జోసెఫ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి సురేంద్రగౌడ్

అల్లాపూర్, ఫిబ్రవరి 9: కబీర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో జోసెఫ్‌కిరీటం విజయం సాధించాడు. 351ఓట్లు ఉన్న సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి ముగ్గురు అభ్యర్థులు పోటీ పడ్డారు. 347 ఓట్లు పోలవ్వగా, లక్ష్మీనారాయణకు 75 ఓట్లు వచ్చాయి. నీరజ్ దూబేకు 22 ఓట్లు పోలయ్యాయి, 250 ఓట్లు జోసెఫ్ కిరీటంకు పోలయ్యాయి. 175 ఓట్ల మెజార్టీతో జోసెఫ్ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి సంఘం సురేందర్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు ఎన్నికల అధికారి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన

స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

అల్లాపూర్, ఫిబ్రవరి 9: డివిజన్ పరిధిలోని సెంట్రల్ అల్లాపూర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కార్పొరేటర్ సబీహాబేగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు గౌసుద్దీన్, వీరారెడ్డి, జ్ఞానేశ్వర్, జబ్బార్, ఇస్మాయిల్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయిస్తా

కాలనీ వాసులతో సమావేశమైన కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్, ఫిబ్రవరి 9: కాలనీ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతానని బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని అరబిందో కాలనీలో పర్యటించి అనంతరం కాలనీ వాసులతో కార్పొరేటర్ ఆదివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయిస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు చైతన్య, రాము, లోకేశ్, నారాయణరెడ్డి, బాబుదిలీప్, రాకేశ్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

నాటక ప్రదర్శన లిస్తున్న కళాకారులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 9 : కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ సత్సంగ్ సమావేశం మందిరంలో సాధన సాహితీ స్రవంతి హైదరాబాద్ 43వ వార్షికోత్సవ సందర్భంగా ప్రదర్శించిన బామిని భువన విజయం నాటకం శ్రోతలను ఆకట్టుకుంది. ఆదివారం జరిగిన నాటక ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా వివేకానంద సేవా సమితి చైర్మన్ సిహెచ్ హనుమంతరావు, అశ్విని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావు, ప్రముఖ సాహితీవేత్తలు ఎస్. అనంతలక్ష్మి, సూర్యనారాయణ మూర్తి ప్రారంభించారు. విద్యార్థులు వివిధ వేషధారణతో ఆయా పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నరసింహాచార్య, కార్యదర్శి శంభునికుమార్ ఉన్నారు.

తాగునీటి చెరువుగా తీర్చిదిద్దుతాం

చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, చిత్రంలో కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్ ఫిబ్రవరి 9: గురునాథం చెరువును తాగునీటి చెరువుగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువును నేక్సస్‌మాల్, మలిగవాడ్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో చేపడుతున్న సుందరీకరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆదివారం ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు గురునాథం చెరువు మంచినీటిని అందించేదని, కాలక్రమేనా మురికి కూపంగా తయారయిందన్నారు. చెరువుల అభివృద్ధి లక్ష్యంగా పనులను చేయిస్తున్నట్లు, ప్రధానంగా గురునాథం చెరువు సుందరీకరణకు నెక్సస్‌మాల్ సీఎస్ఆర్ పథకం కింద ముందుకు రావడం అభినందనీయం అన్నారు. కాంక్రీట్‌కు భిన్నంగా సహజమైన మట్టితో చెరువును పూర్తిస్థాయిలో బాగుచేసి తాగునీటితో అలరారేలా తీర్చిదిద్దాలని సూచించారు. పరిసరాలను పచ్చదనంతో ఆహ్లాదంగా రూపొందించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలని పీఏసీ చైర్మన్ గాంధీ పిలుపునిచ్చారు. పనులను త్వరగా చేపట్టాలని మల్లిగవాడ సంస్థకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ ప్రతినిధులు రామ్ అవినాశ్, చైతన్య, లోకేశ్, రామ సుబ్బారెడ్డి, కార్తికేయ, రామకృష్ణ, సాయి ప్రశాంత్, వివేకానంద, రమణమూర్తి పాల్గొన్నారు.

మాస్టర్స్ పోటీల విజేతలకు అభినందనలు

విజేతలను అభినందిస్తున్న తెలంగాణ సంయుక్త కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్

మాదాపూర్, ఫిబ్రవరి (నమస్తే తెలంగాణ) 9: కేరళ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ మాస్టర్స్ పోటీల్లో పతకాలు సాధించిన విజేతలను తెలంగాణ సంయుక్త కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అభినందించారు. చందానగర్ హుడాకాలనీలో ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పతకాలు సాధించిన వారిని అభినందించారు. పీజేఆర్ స్టేడియంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శిక్షణ పొందిన అజయ్‌కుమార్, రామారావు, ఏసురత్నం, నాగలక్ష్మి, స్వాతి, మానసపతి, శివలీలారెడ్డి, స్వాతిగౌడ్, జయలక్ష్మి, మల్లేశ్వరి, శైలజ, భవాని తదితరులు పతకాలు సాధించిన వారిలో ఉన్నారు. ఇందులో భాగంగా మొత్తం 21 పతకాలు రాగా, 7 బంగారు, 7 రజత, 7 కాంస్య పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్, ట్రెజరర్ స్వాతితో పాటు మాస్టర్స్ పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ క్రీడల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 9 : సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జేఎన్‌టీయూహెచ్‌లో క్రీడా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు బంజారా విద్యార్థి సంఘం చైర్మన్ ధరావత్ నరేందర్ నాయక్, వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య రాజకుమార్ తెలిపారు. ఈనెల 13న వర్సిటీ క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యే ఈ క్రీడా పోటీల వాల్‌పోస్టర్‌ను వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ నరసింహారెడ్డి, అడ్మిషన్ డిప్యూటీ డైరెక్టర్ సైదా ఆవిష్కరించారు. అదే విధంగా ఈ నెల 28న వర్సిటీలో సంతు సేవాలాల్ జయంతిని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు భానుప్రకాశ్, ఆకాశ్ నాయక్, శశికుమార్, సింహాద్రి, విష్ణు, మోహిత్, ప్రణీత, అనూష, లైలా, సంధ్య, వైశాలి పాల్గొన్నారు.

ముగిసిన ఒడియా ఉత్సవాలు

నృత్య ప్రదర్శన లిస్తున్న కళాకారులు

కొండాపూర్, ఫిబ్రవరి 9 : మాదాపూర్‌లోని శిల్పా రామంలో కొనసాగుతున్న ఒడియా ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. నగరంలోని ఒడిస్సా వాసులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో పలువురు కళాకారులు కథక్, ఒడిసి, సంబల్పూరి, ఒడియా జానపద పాటలతో అలరించారు. దహిబర అలూదుమ్, రసగుల్లా, ముది మాంశో, చిన్నపొడ మొదలైన వంటకాలు ప్రదర్శనలో ఉంచారు. ఈ వేడుకలకు పలువురు ప్రముఖులు హాజరై కళాకారులను అభినందించారు.

కుత్బుల్లాపూర్: జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆదివారం జరిగిన 2002- 2003 సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. తమకు విద్యా బోధనలు నేర్పించిన ఉపాధ్యాయులను విద్యార్థులందరూ సన్మానించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో గురువులు, బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాంకీ ప్రీమియర్ లీగ్

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న భారత జట్టు మాజీ క్రీడాకారుడు ఎంఎస్‌కే ప్రసాద్ ఇతర ప్రముఖులు

శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 9: క్రీడలు సమాజంలో స్నేహభావాన్ని పెంపొందిస్తూ ఐకమత్యాన్ని చాటుతాయని భారత జట్టు మాజీ క్రికెటర్ ఎమ్ఎస్‌కే ప్రసాద్ అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలో రాంకీ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాంకీ ఎస్టేట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో రాంకీ నివాస కమ్యూనిటీలకు చెందిన నివాసితుల మధ్య ఐక్యత భావాన్ని పెంపొందిస్తాయని రాంకీ సీఎఫ్‌వో ఎన్ఎస్ రావు, రీజినల్ డైరక్టర్ శరణ్ చల్లాలు అన్నారు. రాంకీ కి చెందిన 12 కమ్యూనిటీల నుంచి 16 జట్లు 31 మ్యాచుల్లో తలపడనున్నాయని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కీసర, ఫిబ్రవరి 9; కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను క్రైం బృందం బాధితులకు అప్పగించింది.ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్, క్రైం బృందం సభ్యుడు జి.వెంకట నారాయణ, డిటెక్టివ్ సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి 4 సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న బాధితులకు అందజేశారు.

బ్యాంక్ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు

కీసర, ఫిబ్రవరి 9 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బీమా పథకాలను బ్యాంక్ అకౌంట్ కలిగిన ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని సోసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎన్జీవో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కోఆర్డినేటర్ కె. శ్రీనివాస్‌రావు తెలిపారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయం ఫేస్-2లో ఎస్ఎస్‌టీ కీసర సీఎఫ్ఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అర్థిక అక్షరాస్యత' కళాజాత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 నుంచి 70 ఏండ్ల వయసు గల బ్యాంక్ ఖాతాదారులు రోడ్డు ప్రమాదాల్లో దుర్మరణం, వైకల్యం కలిగిన ఆమా బీమా పథకాలు వారి కుటుంబానికి అండగా నిలుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీహరిగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అగోండాచారి, జనరల్ సెక్రటరీ వెంకటేశ్వర్‌రావు, ట్రెజరర్ రఘునాథ్, బ్లాక్ అధ్యక్షుడు రుద్రామచారి, ఎస్ఎస్‌టీ ఎఫ్ఎల్ కీసర మండల కోఆర్డినేటర్ విశ్వనాథ్, కౌన్సిలర్స్ ఉమామహేశ్వరి, కళాజాత బృందం పాల్గొన్నారు.